క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



జంగారెడ్డిగూడెంలో పరీక్షలు చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

జంగారెడ్డిగూడెం: ఈనెల 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యారోగ్య శాఖ సిబ్బంది ప్రజలకు సూచిస్తున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో ఆయా సచివాలయాల పరిధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటా సర్వే నిర్వహించారు. సర్వేలో ఆయా కుటుంబాల్లోని వ్యక్తులకు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి వివరాలు నమోదు చేసుకున్నారు.

భగత్‌సింగ్ జయంతి

చింతలపూడి: స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యాన భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి యువజన నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో భగత్‌సింగ్ సేవలను కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ తొర్లపాటి రాజు, సీపీఐ కార్యదర్శి కె.గురవయ్య, తొర్లపాటి బాబు, గట్టు వెంకటేశ్వరరావు,, బొల్లవరపు విజయశేఖర్, బత్తుల రఘు, బొంతు నవీన్ పాల్గొన్నారు.

వైభవంగా హనుమద్ కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్: ఆంజనేయ స్వామి జన్మ నక్షత్రం పురస్కరించుకుని గురువారం జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెంలోని శ్రీ మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రంలో సువర్చలా హనుమద్ కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామివారి జరిపారు. భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కార్య నిర్వహణాధికారి ఆకుల కొండలరావు, ఆలయ పర్యవేక్షకుడు రంగారావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

అఖండ అన్నసమారాధన

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డులో గల శ్రీ వల్లీ దేవసేన సమేత సుందర బాల సుబ్రహ్మణ్యేశ్వర అన్నప్రసాద వితరణ కమిటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీగణపతి స్వామివారి 10వ వినాయక చవితి మహోత్సవాలను పురస్కరించుకుని 11వ రోజు గురువారం మధ్యాహ్నం మందిరం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. స్థానిక ప్రతిభ పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థులు (అక్షోభ్య టీమ్), స్థానిక యువత, మహిళలు, కమిటీ సభ్యులు సేవలు అందించారు. స్వామివారి లడ్డూ వేలంలో రూ.15 వేలకు పలికినట్లు సుబ్రహ్మణ్యేశ్వర అన్నప్రసాద వితరణ కమిటీ సభ్యులు తెలియజేశారు.

పెంపుడు కుక్కలకు టీకాలు

కొయ్యలగూడెం: ప్రపంచ రేబిస్ అవగాహన దినోత్సవం పరింపూడి పశువైద్యశాల వద్ద గురువారం నిర్వహించారు. పశువైద్యాధికారి శ్రీనివాస్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ గంజి మాల రామారావు హాజరై రేబిస్ వ్యాక్సిన్ శిబిరాన్ని ప్రారంభించారు. పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాల్సిన ఆవశ్యకతను వివరించారు. పెంపుడు కుక్కలతో ప్రదర్శన నిర్వహించి 3 కుక్కలకు టీకాలు వేశారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

పోలవరం రూరల్: పోలవరంలో అహలే సున్నత్ జమాతే మసీదు కమిటీ అధ్యక్షుడు యాసీన్ షరీఫ్ ఆధ్వర్యాన గురువారం ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబీ పండుగను ఘనంగా నిర్వహించారు. మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేసి రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని అల్లాని కోరారు. మహమ్మద్ ప్రవక్తకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గ్రామంలో ప్రధాన రహదారుల వెంట ముస్లిం జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి సందని, కోశాధికారి షేక్ సలీమ్, మహమ్మద్ బాషా, పఠాన్ కాజా, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

గణపతి హోమం

కుక్కునూరు: గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం కుక్కునూరు శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో గణపతి హోమం, అన్నదానం నిర్వహించారు. ఆలయ అర్చకుడు నవీన్ శర్మ ఆధ్వర్యాన జరిగిన హోమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. మండలంలోని పలు మండపాల్లో 11 రోజులు పూజలందుకున్న వినాయక విగ్రహాలను గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం గోదావరిలో నిమజ్జనం చేశారు. విగ్రహాల ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కుక్కునూరు ప్రధాన సెంటర్‌లో బందోబస్తు ఏర్పాటు చేశారు.

గణేష్ లడ్డూ వేలం

జంగారెడ్డిగూడెం: స్థానిక విజయదుర్గ అమ్మవారి ఆలయంలో గణేష్ ఉత్సవాల్లో భాగంగా గురువారం లడ్డూ వేలం నిర్వహించారు. ఆలయ శాశ్వత కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన వేలంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుడిమెట్ల యుగంధర్ లడ్డూను రూ.10,516లకు దక్కించుకున్నట్లు ఆలయ శాశ్వత కమిటీ ప్రధాన కార్యదర్శి మాడా రామ్మోహనరావు తెలిపారు. యుగంధర్ దంపతులకు అర్చకులు సుదర్శనం వేణుగోపాలాచార్యులు వేదాశీర్వచనం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అవినీతికి తావులేని సంక్షేమ పాలన

- రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి
- ఎమ్మెల్యే తెల్లం బలరాజు వెల్లడి
- టి.నరసాపురం మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

టి.నరసాపురం: అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. మండలంలోని అల్లంచర్ల రాజుపాలెం, కొత్తగూడెం గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అందజేసిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ఎమ్మెల్యే ముందుకు సాగారు. స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి సూచనలిచ్చారు.



టి.నరసాపురం మండలం అల్లంచర్ల రాజుపాలెంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

పలు రాష్ట్రాలకు ఆదర్శం ఆంధ్రప్రదేశ్

ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పారదర్శక పాలన కారణంగా దేశం మొత్తం రాష్ట్రం వైపే చూస్తోందన్నారు. సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాలను అధ్యయనం చేసి పలు రాష్ట్రాలు అవలంబిస్తున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ దేశానికే తలమానికంగా మారిందన్నారు. అన్ని శాఖల సేవలు గ్రామాల్లోనే అందుబాటులోకి తేవడంతో పాటు సంక్షేమ పథకాలను నేరుగా అవినీతి రహితంగా కుల, మత, రాజకీయ వర్గాలకు అతీతంగా అందిస్తున్నారని వివరించారు.

నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి

నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లకు సుందరమైన పక్కా భవనాలు నిర్మించారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనురాజు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు, సహకార సంఘం చైర్మన్ వాసిరెడ్డి మధు, ఎంపీటీసీ సభ్యులు బొడ్డపాటి రాంబాబు, బండి సుబ్బారావు, నార్లపాటి వెంకటేశ్వరరావు, పామాయిల్ ఓఈఆర్ కమిటీ డైరెక్టర్ తుమ్మూరి శ్రీనివాసరెడ్డి, బోళ్ల రంగారావు, కత్తి వెంకటేశ్వరరావు, కాకర్ల సత్తిబాబు, గదెల్లి ములకయ్య , కాకరల శ్రీరాములు, కలిశెట్టి రాంబాబు, బొచ్చు అంజిబాబు, నల్లూరి వెంకటేశ్వరరావు, యర్రా గంగాధరరావు, తేజ, బొడ్డు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బైబై గణేశా.. భక్తిశ్రద్ధలతో నిమజ్జనోత్సవం

లింగపాలెం: వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చూసిన గణనాథుని విగ్రహాలను గురువారం ఘనంగా ఊరేగించారు. మేళతాళాలు, కోలాటం, విచిత్ర వేషధారణల మధ్య యువత నృత్యాలు చేశారు. ధర్మాజీగూడెం, కె.గోకవరం, లింగపాలెం, మఠంగూడెం, యడవల్లి, అయ్యపరాజుగూడెం తదితర గ్రామాల్లో గణనాథుని ఊరేగింపులు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఊరేగింపుల అనంతరం గణనాథుని విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేశారు.

బాలల ఆధ్వర్యాన ఊరేగింపు

కొయ్యలగూడెం: మండలంలోని టేకుతోట ప్రాంతంలో బాలగణపతి 18వ వార్షికోత్సవాల సందర్భంగా లడ్డూను వేలం వేసి అనంతరం స్వామివారి ఊరేగింపు బాలల ఆధ్వర్యాన చేపట్టారు. వాటర్ ట్యాంక్ రామాలయం, సత్యసాయి నగర్, ఆటో యూనియన్, తూర్పు పేటలోని గణనాథుల విగ్రహాలు నిమజ్జనానికి కళాకారుల వేషధారణలు, బాణసంచా పేలుడు మధ్య తరలాయి. వడ్డీల పేటలో ఏర్పాటు చేసిన మండలంలోనే అతి ఎత్తైన గణనాథుని విగ్రహాన్ని 30వ తేదీ అన్నసమారాధన కార్యక్రమం అనంతరం నిమజ్జనం చేయనున్నారు.



కొయ్యలగూడెం టేకుతోట ఏరియాలో స్వామివారిని ఊరేగింపునకు తరలిస్తున్న బాల భక్త బృందం

గోదారమ్మ చెంతకు గణనాథుడు

పోలవరం రూరల్: వినాయక నవరాత్రి మహోత్సవాలు ముగిసిన సందర్భంగా పోలవరం మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలను గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. వినాయక విగ్రహాలను ట్రాక్టర్లపై ఏర్పాటు చేసి గ్రామాల్లో వాయిద్యాలతో ఊరేగిస్తూ పట్టిసం రేవులో నిమజ్జనం చేశారు. జైజై గణేశా, జై బోలో గణేశా అంటూ యువత ఉత్సాహంగా కేరింతలు కొడుతూ ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

జల్లేరు జలాశయంలో నిమజ్జనం

బుట్టాయగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో వినాయకుని విగ్రహాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. తీన్మార్ డప్పులతో బాణసంచా కాల్చారు. యువకులు డ్యాన్స్‌లు చేస్తూ విఘ్నేశ్వరుడిని పలు వీధుల్లో ఊరేగించారు. అనంతరం దొరమామిడి సమీపంలోని గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయంలో నిమజ్జనం చేశారు. నిమజ్జన సమయంలో ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

వినాయకా.. సెలవిక

ద్వారకాతిరుమల: వినాయక నిమజ్జన వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం అట్టహాసంగా జరిగాయి. ద్వారకాతిరుమలలోని సొసైటీ పెట్రోల్ బంకు వద్ద నెలకొల్పిన స్వామివారిని ఉత్సవ కమిటీ సభ్యులు క్షేత్ర పురవీధుల్లో ఊరేగించి, పంగిడిగూడెం వద్ద పోలవరం కుడి కాలువలో నిమజ్జనం చేశారు. ముందుగా గణనాథుడిని కమిటీ సభ్యులు విశేషంగా అలంకరించిన వాహనంలో ఉంచి, గ్రామంలో ఊరేగించారు. తీన్మార్ డప్పు వాయిద్యాలు, డీజే సందళ్లు, చిత్ర విచిత్ర వేషధారణలతో జరిగిన ఈ వేడుక చూపరులను ఆకట్టుకుంది. పెద్ద ఎత్తున యువత పాల్గొని డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. రాత్రి పోలవరం కాలువలో నిమజ్జన వేడుకను గణేష్ నామస్మరణల నడుమ ఘనంగా నిర్వహించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు కృతజ్ఞతలు

కుక్కునూరు: కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో కాంట్రాక్ట్ ఉద్యోగుల దశాబ్దాల కల నెరవేరిందని ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకులు సున్నం శ్రీరాములు దొర గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఒక్క కాంట్రాక్ట్ ఉద్యోగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటారని, ఎన్నోఏళ్లుగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న సిబ్బంది సమస్యను ముఖ్యమంత్రి పరిష్కరించడం పట్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కాంట్రాక్ట్ ఉద్యోగుల తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సన్నాహక సదస్సును విజయవంతం చేయాలి

టి.నరసాపురం: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం కోస్తాంధ్రా జిల్లాల సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి విస్సంపల్లి సిద్దు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో ఈ సదస్సును ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు వివరించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతారని వివరించారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనుల ప్రారంభం

కొయ్యలగూడెం: రాజవరం పంచాయతీ గంగవరం సచివాలయం–2 పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మంజూరు చేయడంతో పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొండేపాటి చింతయ్య, వార్డు సభ్యురాలు కొడారి రేఖ, గ్రామ కమిటీ అధ్యక్షుడు కంచర్ల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షల విరాళం

కామవరపుకోట: మండలంలో ఉప్పలపాడు నుంచి రామన్నపాలెం వెళ్లే రహదారి సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ఉపాధి పథకం ద్వారా రూ.20 లక్షల నిధులు కేటాయించగా, అదనంగా మరో రూ.5లక్షలు రామన్నపాలెం గ్రామానికి చెందిన పెనుమత్స బంగార్రాజు జ్ఞాపకార్థం ఆయన కుమారులు విరాళంగా అందజేశారు. నిర్మాణ పనులను బంగార్రాజు సతీమణి పెనుమత్స విజయలక్ష్మి ప్రారంభిచారు. దాతలకు ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ రమేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు అన్నపనేని రాజశేఖర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

కృష్ణారావుపేట పీఏసీఎస్ పనితీరు భేష్

పోలవరం రూరల్: పోలవరం గ్రామంలోని కృష్ణారావుపేట పీఏసీఎస్‌లో 2022–23 సంవత్సరానికి సంబంధించి ఆర్థిక లావాదేవీలు మెరుగ్గా సాధించారు. దీంతో సొసైటీ అధ్యక్షుడు బలిజిరెడ్డి అప్పారావు, కార్యదర్శి కారిపిరెడ్డి రాంబాబులకు జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షుడు పీవీఎల్ నర్సింహరాజు, బ్యాంకు సీఈవో శ్రీదేవి జ్ఞాపికలు అందజేసినట్లు అధ్యక్షుడు తెలిపారు. 2022–23 సంవత్సరానికి సంబంధించి సంఘ సభ్యుల నుంచి వసూలు చేయాల్సిన అన్ని రకాల రుణాలను సకాలంలో వసూలు చేసినట్లు పేర్కొన్నారు. పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, కరోనా రుణాలు, బంగారు హామీ రుణాలు, వ్యక్తిగత రుణాలు నూటికి నూరుశాతం వసూలు చేసినందుకు జిల్లా అధ్యక్షుడు పీవీఎల్ వీరిని అభినందించారు. అలాగే సంఘంలోని రైతులు కూడా సకాలంలో రుణాలు చెల్లించి సహకరించినందుకు బ్యాంకు సిబ్బంది అభినందనలు తెలిపారు.



సొసైటీ చైర్మన్, కార్యదర్శికి జ్ఞాపికను అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ నర్సింహరాజు

ఏసుక్రీస్తు అందరికీ ప్రభువే

ద్వారకాతిరుమల: ఏసుక్రీస్తు అందరికీ ప్రభువేనని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని ఐఎస్ రాఘవాపురంలో నూతనంగా నిర్మించిన బేతెస్థ ప్రార్థనా మందిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సంఘ కాపరి పాస్టర్ జి.విజయ్ పాల్, రెవ. పాల్, వాక్యోపదేశకులు రెవ. ఫిన్నీ అబ్రహం, సంఘ పెద్దలు బోడపాటి చంద్రరావు, చీకట్ల ఆనందరావు, మాంద్రు సత్యానందం, రాజు, శ్రీనుతో కలసి ఎమ్మెల్యే తలారి క్రీస్తు గొప్పతనంపై ప్రసంగించారు. అనంతరం సంఘస్తులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాకారపు బంగారమ్మ, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, ఐఎస్ జగన్నాధపురం సర్పంచ్ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.



ఐఎస్ రాఘవాపురంలో చర్చి ప్రారంభం అనంతరం ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

బయో ఫెర్టిలైజర్స్ తయారీపై రైతులకు అవగాహన

జంగారెడ్డిగూడెం: రైతులు సహజ సిద్ధమైన ఎరువులు, పురుగుమందులు వాడటం ద్వారా నాణ్యమైన దిగుబడిని పొందవచ్చని వర్జీనియా పొగాకు బోర్డు ఎక్స్‌టెన్షన్ మేనేజర్ దామోదర్ అన్నారు. జంగారెడ్డిగూడెం వర్జీనియా వేలం కేంద్రం–2లో గురువారం రైతులకు బయో పెస్టిసైడ్స్, బయో ఫెర్టిలైజర్స్ తయారీ, వాడే విధానంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం -1, 2 వేలం కేంద్రాల నిర్వాహణాధికారులు బి.శ్రీహరి, జె.సురేంద్రకుమార్, పొగాకు బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబా పుట్టినరోజు వేడుకలు

లింగపాలెం: మండలంలో శ్రీ షిర్డీ సాయిబాబా పుట్టినరోజు వేడుకలను భక్తులు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధర్మాజీగూడెం, లింగపాలెం, బాదరాల సాయిబాబా మందిరాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో బాబాను దర్శించుకున్నారు. పిల్లలకు బహుమతులు అందజేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదానం, ప్రసాదాలు పంపిణీ చేశారు.

కొమ్ముగూడెంలో సత్య వ్రతాలు

బుట్టాయగూడెం: ఏజెన్సీలో షిర్డీ సాయిబాబా పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుట్టాయగూడెం, కొమ్ముగూడెం, దొరమామిడి, పీఆర్ గూడెం, రాజానగరం, తదితర గ్రామాల్లోని షిర్డీ సాయి మందిరాల్లో తెల్లవారు జామున నగర సంకీర్తన, ఉదయం నుంచి సత్య వ్రతాలు ఆచరించారు. అన్నసమారాధనలు నిర్వాహించారు. కొమ్ముగూడెంలో సాయిబాబా విగ్రహం ఏర్పాటు చేసి 6 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రతేక పూజాలు నిర్వహించారు. కార్యక్రమంలో సాయి భక్తులు కలగర సత్యనారాయణ, లక్ష్మీకాంతం, కలగర నాని, ఆలపాటి దుర్గారావు, యాంద్రప్రగడ నాగ శ్రీనివాసరావు, దొమ్మేటి సత్యనారాయణ, దొమ్మేటి అమ్మిరాజు, మలకపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా

కామవరపుకోట: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు అన్నారు. గురువారం కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యాన జాషువా జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మల్లేశ్వరరావు మాట్లాడుతూ జాషువా ఆకాంక్షించిన సమ సమాజ స్థాపన కోసం యువత కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు, జి.రామ్మోహన్, వి.శ్రీనివాస్, ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, ధారావతు మల్లేష్, ఎ.హర్షవర్ధిని, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జాషువా, భగత్‌సింగ్‌లకు నివాళి

టి.నరసాపురం: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని, భగత్‌సింగ్ చిన్నతనం నుంచి దేశ భక్తి కలిగిన వాడని అరసం (అభ్యుదయ రచయితల సంఘం) రాష్ట్ర కార్యదర్శి బీఎస్ సాగర్ అన్నారు. స్థానిక విజన్ యూపీ స్కూల్ లో గురువారం భగత్‌సింగ్, జాషువా జయంతి వేడుకలను పురం శ్రీనివాస్ ఆధ్వర్యాన నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్, జాషువా జీవిత చరిత్రలపై విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి యువతరానికి ఆదర్శం

బుట్టాయగూడెం: భగత్‌సింగ్ ఆశయాలు నేటి యువతరానికి ఆదర్శమని సీపీఎం నాయకులు ఎస్‌వీ అప్పారావు అన్నారు. స్థానిక భగత్‌సింగ్ నగర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అప్పారావు మాట్లాడుతూ 23 ఏళ్ల వయస్సులో దేశం కోసం ఉరితాడును ముద్దాడిన మహోన్నత వ్యక్తి భగత్‌సింగ్ అని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు నెలటూరి నిర్మల, కెచ్చెల రమణ, కాలనీ కమిటీ సభ్యులు అక్బర్, సీత, మణి, సూర్యకుమారి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



టి.నరసాపురంలోని విజన్ స్కూల్‌లో జాషువా, భగత్‌సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న నిర్వాహకులు

సమాజంపై జాషువా రచనల ప్రభావం

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గుర్రం జాషువా జయంతి నిర్వహించారు. ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.సురేష్, ఉపాధ్యాయులు జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సమాజంపై జాషువా రచనల ప్రభావాన్ని తెలుగు పండిట్ డాక్టర్ మద్దాల పెద్దిరాజు వివరించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఎంఎస్ స్వామినాథన్‌కు ఘన నివాళి

కొయ్యలగూడెం: వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మృతికి కొయ్యలగూడెం అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.జనార్దన్‌రావు ఆధ్వర్యాన సంతాప సభ నిర్వహించి హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ చెన్నైలో కన్నుమూయడం పట్ల విచారం వ్యక్తం చేశారు. స్వామినాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రైతు పక్షపాతి స్వామినాథన్

కుక్కునూరు: రైతు పక్షపాతి ఎంఎస్ స్వామినాథన్ అని ఏపీటీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ గౌస్ అన్నారు. స్వామినాథన్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రైతాంగం పడుతున్న కష్ట,నష్టాలు తెలిసిన మేధావి మరణించడం బాధాకరం అన్నారు.



కొయ్యలగూడెంలో స్వామినాథన్‌కు నివాళులర్పిస్తున్న అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది

ద్వారకాతిరుమల చేరిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ ర్యాలీ

ద్వారకాతిరుమల: యూటీఎఫ్ ఆవిర్భవించి 50 వసంతాలు పూర్తికానున్న సందర్భంగా శ్రీకాకుళంలో చేపట్టిన స్వర్ణోత్సవ ర్యాలీ గురువారం ద్వారకాతిరుమల చేరుకుంది. స్థానిక యూటీఎఫ్ భవనం వద్ద నేతలు సీహెచ్ జగన్మోహన్‌రావు, ఆర్.రవికుమార్‌లు పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్‌కే ప్రసాద్ మాట్లాడుతూ స్వర్ణోత్సవ సంబరాలను పురస్కరించుకుని విజయవాడలో అక్టోబర్ 1న పదివేల మందితో చేపట్టిన సభను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ స్వర్ణోత్సవ సంబరాల సన్నాహక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమలలో స్వర్ణోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జంగారెడ్డిగూడెం: సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో భౌతిక శాస్త్రం పోస్టులకు అర్హతలు కలిగిన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై, అనుబంధంగా ఏపీ సెట్ లేదా ఎంఫిల్, పీహెచ్‌డీ ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను అక్టోబర్ 5వ తేదీలోగా కళాశాల కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని, ఇంటర్వ్యూ తేదీ ఫోన్ ద్వారా తెలియజేస్తామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఓ భక్తుడు గురువారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన కె.జానకి రమణ ముందుగా కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణ స్వామి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.